క్లుప్తంగా

వడదెబ్బపై విస్తృత అవగాహన

సంగం: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డాక్టర్ శ్రీనివాసులరెడ్డి సూచించారు. సంగం పీహెచ్‌సీలో బుధవారం ఆయన వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం 11 గంటలలోపే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని, సాయంత్రం 4 గంటల తరువాతే బయటకు రావాలని సూచించారు. సచివాలయాలు, హెల్త్‌సబ్‌సెంటర్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

రంజాన్‌కు సరుకుల పంపిణీ

వరికుంటపాడు: మండలంలోని తోటలచెరువుపల్లిలోని ముస్లిం కుటుంబాలకు రంజాన్‌ను పురస్కరించుకుని ఉదయగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కొట్టె వెంకటేశ్వర్లు గురువారం సరుకులు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు పఠాన్ రసూల్, గుమ్మళంపాటి వెంగళరావు, తదితరులు పాల్గొన్నారు.

8 మంది బడి బయట పిల్లల గుర్తింపు

సీతారామపురం: మండలంలో బడి బయట ఉన్న విద్యార్థులు 8 మందిని గుర్తించినట్లు ఎంఈఓ మస్తాన్‌వలి గురువారం తెలిపారు. బసినేనిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు, పంద్రంగి ప్రాథమిక పాఠశాలలో నలుగురు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఒకరిని, సీతారామపురం స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో మరో విద్యార్థిని చేర్పించినట్లు వివరించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

జలదంకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సీతారామపురం : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. వర్షపాతం తక్కువగా ఉన్న గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతిపంపులను బాగుచేయించాలని సూచించారు. మండలానికి నూతనంగా 98 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయని తెలిపారు. నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనీనిస్సీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

608 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 608 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 628 బేళ్లు రాగా, అందులో 608 బేళ్లను విక్రయించామని చెప్పారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.255, సగటున రూ.276.81 ధర పలికిందని వివరించారు. కాగా వేలంలో 8 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం బిల్లుపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్న మహమ్మద్ రఫీ అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. రఫీ మృతిపై సహచర ఉపాధ్యాయులు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. విద్యార్థులకు పాఠాలు బోధించడంలో మంచి పేరున్న రఫీ మృతిని జీర్ణించుకోలేకున్నామని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఉపకరణాల పంపిణీ



ఉదయగిరి: పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు గురువారం అందజేశారు. దివ్యాంగ విద్యార్థులు యాకూబ్, శ్రావణ్‌కుమార్, దీప్తికి అలీమ్‌కో, సమగ్ర శిక్ష అభియాన్ అందజేసిన హియరింగ్ మెషీన్లు, వీల్‌చైర్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహ, రమణ, ఐఈఆర్పీలు శివనందిని, సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

అంతుచిక్కని వింతవ్యాధి

- పుట్టినప్పట్నుంచి యువకుడి సతమతం
- ఆర్థిక స్తోమతకు మించి వైద్యం చేయించిన తల్లిదండ్రులు
- అయినా మెరుగుపడని ఆరోగ్యం
- పదేళ్లుగా మంచానికే పరిమితం
- రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్న తండ్రి
- కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్న తల్లి
- నిస్సహాయ స్థితిలో దాతల సాయం కోసం వేడుకోలు



గడ్డలతో మంచానికే పరిమితమైన బొమ్మిశెట్టి నవీన్

అనుమసముద్రంపేట: ఆ యువకుడు పుట్టినప్పట్నుంచి అంతుచిక్కని వింత వ్యాధితో సతమతమవుతున్నాడు. అష్టకష్టాలు పడి వైద్యం చేయిస్తున్న తండ్రి రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కాళ్ల పోగొట్టుకుని ఇంటికే పరిమితమయ్యాడు. అప్పట్నుంచి తల్లిపై కుటుంబ భారం పడింది. కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ నేపథ్యంలో యువకుడికి వైద్యం చేయించలేని నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు దాతల సాయం కోసం వేడుకుంటున్నారు. మండలంలోని అనుమసముద్రం గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వరలక్ష్మి దంపతులకు చెందిన 28 ఏళ్ల కుమారుడు నవీన్ పుట్టినప్పటి నుంచి వింత వ్యాధితో బాధపడుతున్నాడు. పుట్టినప్పుడే ఒంటిపై చిన్నపాటి గడ్డలు లేచాయి. అప్పట్లో మామూలు గడ్డలే అని తల్లిదండ్రులు వదిలేశారు. ఆ తరువాత నవీన్ పెరిగే కొద్దీ ఒంటిపై గడ్డలు సైతం పెద్దవిగా మారాయి. ఆ తరువాత శరీరమంతా గడ్డలతోనే నిండిపోయింది. గత పదేళ్లుగా తల్లిదండ్రులు తమ ఆర్థిక స్తోమతకు మించి చెన్నైలోని విజయా ఆస్పత్రి, ఎగ్మూర్‌లోని బేబీ ఆస్పత్రి, హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి, నెల్లూరులోని నారాయణ ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. చెన్నైలోని వైద్యశాలల్లో మూడుసార్లు ఆపరేషన్లు చేయించారు. ఒకచోట గడ్డను తొలగిస్తే వెంటనే మరోచోట కొత్తగా పుడుతుండడంతో వైద్యులు సైతం ఏమి సమస్యే తేల్చి చెప్పలేని పరిస్థితుల్లో అంతుచిక్కని వింత వ్యాధి అని, వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు తల్లిదండ్రులు అప్పు చేసి దాదాపు రూ.10లక్షల వరకు ఖర్చు చేసి వైద్యం చేయించారు. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం నవీన్ తండ్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రెండు కాళ్లు విరిగిపోయి మంచానికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం ఊతకర్రపై నడుస్తున్నాడు. తల్లి వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వైద్యం అందించలేని నిస్సహాయ స్థితిలో కుమారుడ్ని మంచానికే పరిమితం చేశారు. ప్రస్తుతం నవీన్ మంచంలో నుంచి లేవలేని పరిస్థితుల్లో ఉండడంతో ఉండడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. దాతలు ముందుకొచ్చి తమ కుమారుడికి వైద్య సాయాన్ని అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఎవరైనా సాయం చేయాలనుకునే దాతలు 72072 91732 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

గంగమ్మకు విశేష పూజలు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో గురువారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. వైస్‌ఎంపీపీ, గ్రామాభివృద్ధి ప్రదాత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి ముఖ్యఅతిథిగా హాజరై గంగమ్మకు పూజలు చేశారు. తొలుత ఆయన గంగమ్మ భక్తులు వేదపండితుల వేదమంత్రోచ్చారణాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంగమ్మ భక్తులు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేసిన దాతలు జీఎంకే చౌదరి, ఆలయ కమిటీ చైర్మన్ పాముల రమణయ్యను శాలువాలతో సత్కరించారు.



దాతలను సత్కరించిన భక్తులు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

సీతారామపురం : పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని మండల క్రైస్తవ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గురువారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. పాస్టర్ ప్రవీణ్‌ను కొందరు మతోన్మాదులు హత్య చేసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా చిత్రీకరించారని అనుమానం వ్యక్తం చేశారు. పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి కుటుంబానికి న్యాయం చేయకపోతే క్రైస్తవ సమాజం పెద్ద ఎత్తున ఆందోళన చేయక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘ నాయకులు డాక్టర్ కలివెల ఎలీషాకుమార్, నేలటూరి జాషువా, అబ్రహం, మారంరెడ్డిపల్లి విచారణ గురువు ఫాదర్ డేవిడ్, లాజరస్, ప్రభాకర్, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

ఉదయగిరి/వరికుంటపాడు: వరికుంటపాడు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులను రెండ్రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేస్తున్నాయి. మండలంలో 317 పనులకు సంబంధించి రూ.11.76 కోట్ల ఉపాధి నిధులు ఖర్చుచేశారు. ఎస్సార్పీ నీలకంఠ ఆధ్వర్యంలో 12 మంది డీఆర్పీలు గ్రామాలవారీగా జరిగిన పనుల కొలతలు, కూలీలకు అందజేసిన నగదు, తదితర అంశాలపై విచారణ చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు గ్రామస్థాయిలో విచారణ జరిపి అవకతవకలను గుర్తించనున్నారు. కాగా పామూరుపల్లి, రామాపురం, జడదేవి, తదితర గ్రామాల్లో గురువారం తనిఖీలు జరిపిన సామాజిక తనిఖీ బృందాలు అవకతవకలు, లోటుపాట్లను గుర్తించాయి.



పామూరుపల్లిలో కూలీలను విచారిస్తున్న డీఆర్పీ నీలకంఠ

కాగా సామాజిక తనిఖీ బృందాలకు కొందరు క్షేత్ర సహాయకులు సహకరిస్తుండగా మరికొందరు సహకరించడం లేదు. దీంతో సామాజిక తనిఖీ బృందాలు పనులను గుర్తించడంలో సమస్యలు ఎదుర్కొంటున్నాయి.

ఈద్గా మైదానం పరిశీలన



కావలి: రంజాన్ సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్ వద్ద ఉన్న ఈద్గా మైదానాన్ని మున్సిపల్ కమిషనరు జీ శ్రావణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈద్గా మైదానాన్ని శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. రంజాన్ ప్రార్థనలకు హాజరయ్యే ముస్లింలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అనంతరం ఇందిరానగర్ వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించి ఇంజనీరింగ్ సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీ సాయిరాం, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

పరామర్శ

కావలి: పట్టణంలోని ఆరోవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వెంకయ్యను కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల వెంకయ్య అనారోగ్యానికి గురై చికిత్స పొందారు. కొన్ని దిన్నె గిరిజన కాలనీలోని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వెంకయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అలాగే పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేరం వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను రామిరెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

30, 31 తేదీల్లోనూ రిజిస్ట్రేషన్లు

ఆత్మకూరు: 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఈ నెల 30, 31వ తేదీల్లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు యథావిధిగా పనిచేస్తాయని ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండగ సెలవులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు వివరించారు.

రాచవారిపల్లిలో ఘర్షణ

దుత్తలూరు: మండలంలోని రాచవారిపల్లిలో రెండు కుటుంబాల నడుమ గురువారం జరిగిన ఘర్షణలో పలువురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన అంద్రా నాగేశ్వరరావు, శేషాద్రి గ్రామంలో జరుగుతున్న ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ శేషాద్రి మరో వ్యక్తితో గొడవపడుతుండగా నాగేశ్వరరావు అడ్డువెళ్లి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం పాత కక్షలు, ప్రస్తుత వివాదాన్ని మనస్సులో పెట్టుకున్న శేషాద్రి తన కుటుంబ సభ్యులతో కలిసి నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి నాగేశ్వరరావు దంపతులపైన ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన భార్యాభర్తలను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శేషాద్రి సైతం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. దుత్తలూరు పోలీసులు వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా కొండా



కొండా వెంకటేశ్వర్లు

ఆత్మకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి చోటు కల్పించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో భాగంగా ఆత్మకూరు పట్టణానికి చెందిన కొండా వెంకటేశ్వర్లును ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. పార్టీ ప్రారంభం నుంచి విధేయుడిగా పనిచేస్తూ బలోపేతానికి తన వంతు కృషి చేస్తున్న కొండాకు పదవీ బాధ్యతలు అప్పగించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిరు. కాగా తనకు పార్టీలో రాష్ట్ర స్థాయి పదవి రావడానికి సహకరించిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి కొండా కృతజ్ఞతలు తెలిపారు.

డీఎల్‌పీఓ విచారణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై రెండు నెలలక్రితం సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కావలి డీఎల్‌పీఓ మాధవీలత విచారణ జరిపి పంచాయతీ కార్యదర్శి ప్రసన్నను సస్పెండ్ చేశారు. అయితే పంచాయతీ నిధుల దుర్వినియోగంలో పంచాయతీ కార్యదర్శితో పాటు సర్పంచ్ ప్రమేయం కూడా ఉందని, ఇద్దరిపై విచారణ జరపాలని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కందుకూరు డీఎల్‌పీఓ కృష్ణమోహన్ కాటేపల్లి పంచాయతీలో గురువారం విచారణ జరిపారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ నిధుల దుర్వినియోగంపై కార్యదర్శి, సర్పంచ్‌లను విచారించి వివరణ తీసుకున్నట్లు చెప్పారు. రికార్డులను పరిశీలించి నివేదికను డీపీఓకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈఓపీఆర్డీ గోపిశ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మామిడిచెట్ల నరికివేతపై ఫిర్యాదు

వింజమూరు(ఉదయగిరి): తమ పొలంలోని మామిడి చెట్లను ఓ వ్యక్తి అన్యాయంగా నరికివేశాడని వింజమూరు మండలం వెంకటాద్రిపాళెం గ్రామానికి చెందిన మాల్యాద్రి దంపతులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. గ్రామంలోని సర్వేనంబర్ 288-1లో తమకున్న 3.70 ఎకరాల్లో మామిడి చెట్లను సాగుచేస్తుండగా వింజమూరుకు చెందిన వీరదిన్నె మధు అనే వ్యక్తి నరికివేయడంతో పాటు ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన తనపైన దౌర్జన్యం చేశాడని బాధితుడు వాపోయారు. సుమారు రూ.10 లక్షలు నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఈ విషయమై తహసీల్దార్ షేక్ హమీద్‌ను వివరణ కోరగా గతంలోనూ భూమి విషయమై వివాదం చోటుచేసుకున్న మాట వాస్తవమేనని, అది ప్రభుత్వ భూమి అని, దానిపైన ఇరువురికి కూడా ఎలాంటి హక్కు లేదని తెలిపారు. విచారణ చేపట్టి తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

సంగమేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు నియామకం


సంగం : స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయానికి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తాత్కాలిక ట్రస్ట్ బోర్డును దేవాదాయశాఖ అధికారులు నియమించారు. ట్రస్టు బోర్డు చైర్మన్‌గా గునుపూడి గిరితో పాటు మరో ఏడుగురిని సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా గునుపూడి మాట్లాడుతూ రాబోయే బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. తనను చైర్మన్‌గా నియమించిన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అటవీప్రాంతంలో ఎగిసిపడుతున్న మంటలు

సోమశిల: స్థానిక సోమశిల జలాశయం సమీపంలో ఉన్న కొండపై ఉన్న అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి కూడా మంటలు చెలరేగుతూ కనిపించాయి. అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో బుధవారం నుంచి మంటలు చెలరేగుతున్నాయి. అటవీశాఖ అధికారులు మంటలను ఆర్పడంపై దృష్టి సారించకపోడంతో కార్చిచ్చు కొనసాగుతూనే ఉంది. మంటలు కొనసాగితే వన్యప్రాణులతో పాటు మూగజీవాలకు ఆహారం ఉండదని, ఉన్నతాధికారులు చొరవ చూపి మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, వెంకటాచలం తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు మైక్‌సెట్‌ను గురువారం బహూకరించారు. తన తల్లి నాగినేని వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థంగా మైక్‌సెట్‌ను అందజేసినట్లు ఆయన తెలిపారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను అభినందించి క్రీడా పరికరాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నాగినేనిని హెచ్‌ఎం వెంకటేశ్వరరావు సత్కరించారు.

రక్తదానం



కావలి: సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు గురువారం రక్తదానం చేశారు. కావలి మండలం తుమ్మలపెంట, రాముడుపాళెం తదితర గ్రామాలకు చెందిన రామ్‌చరణ్ అభిమానుల సంఘ సభ్యులు కావలి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేశారు. రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా ఏటా రక్తదానం చేస్తున్నట్లు వారు తెలిపారు. కళ్యాణ్, దేవకిరణ్, నాగరాజు, రమేష్, దిలీప్, శీనయ్య, బాబు, జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో క్రికెట్ బెట్టింగుల జోరు

సీతారామపురం: ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన క్రికెట్ బెట్టింగులు ఇప్పుడు పల్లెలకు పాకాయి. ఐపీఎల్ సీజన్ ముగిసేలోగా లక్షాధికారులు అయిపోవచ్చని బెట్టింగ్ ముఠాలు లేనిపోని ఆశలు రేకెత్తిస్తుండడంతో అధిక శాతం మంది బెట్టింగుల వైపు మొగ్గు చూపుతున్నారు. కష్టపడకుండా సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఉద్యోగులు, రైతులు, యువకులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఐపీఎల్ బెట్టింగుల ఊబిలోకి దిగి అప్పులపాలవుతున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ జరుగుతున్న క్రమంలో చిన్నపాటి గ్రామాల్లోనూ క్రికెట్ బెట్టింగులు జోరందుకున్నాయి. వందలు, వేల రూపాయల నుంచి లక్షల్లో బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం. కొందరు ఆన్‌లైన్ యాప్‌లు, ఇంకొందరు వాట్సాప్ గ్రూపుల ద్వారా బెట్టింగులు సాగిస్తున్నట్లు తెలిసింది. యువకులు బెట్టింగ్ వ్యసనానికి బానిసై వారి బైకులు, చైన్లు, ఉంగరాలు తాకట్టు పెట్టి క్రికెట్ బెట్టింగు వేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పోలీసులు బెట్టింగులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాధితులుగా మారిన వారి ద్వారా కీలక సమాచారాన్ని తెలుసుకుని బెట్టింగ్ ముఠాలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పల్లెల్లో ఎవరైనా బెట్టింగులకు పాల్పడుతుంటే 112 లేదా 100 టోల్ ఫ్రీనంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

మల్టీప్లెక్స్‌లు, మాల్స్‌లో పార్కింగ్ ఉచితం

కావలి: మల్లీప్లెక్స్, మాల్స్‌లలో వాహనాల పార్కింగ్ రుసుం వసూళ్లను క్రమబద్ధీకరించి 30 నిమిషాల వరకు ఉచిత పార్కింగ్ అవకాశాన్ని కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 నిమిషాల నుంచి గంట వరకు మల్లిప్లెక్స్, మాల్స్‌లలో కొనుగోలు చేసిన వస్తువుల తాలూక బిల్లులు, సినిమా టికెట్లు చూపించితే ఉచితమని చెప్పారు. గంటకుపైన సినిమా టికెట్లు, ఇతర బిల్లులు చూపిస్తే ఉచితమని తెలిపారు. ఆధారాలు చూపని వారి నుంచి రుసుం వసూలు చేసుకోవచ్చునని చెప్పారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించేనా?

- ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- మున్సిపాలిటీ పన్నుల లక్ష్యం రూ.3.90 కోట్లు
- ఇప్పటి వరకు రూ.2.50 కోట్లు మాత్రమే వసూళ్లు
- మిగిలి ఉన్న వసూళ్ల లక్ష్యం 36శాతం
- ప్రభుత్వ భవనాల పన్నులే అధికం



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం

ఆత్మకూరు: 2024-25 ఆర్థిక సంవత్సరం మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. ఆత్మకూరు మున్సిపాలిటీలో ఇప్పటివరకు 64 శాతం మేర మాత్రమే పన్నులను వసూలు చేశారు. ఇంకా 36శాతం మేర వసూలు చేయాల్సి ఉంది. మున్సిపల్ పరిధిలోని 23 వార్డుల పరిధిలో సుమారు 14వేలకుపైగా అసెస్మెంట్లు ఉన్నాయి. ప్రైవేట్ భవనాలు, వ్యాపార సంస్థకు సంబంధించి రూ.2.87 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.2.26 కోట్లను మాత్రమే వసూలు చేశారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి రూ.1.03 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.17 లక్షల్లోపు మాత్రమే వసూలు చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ భవనాల, వ్యాపార సంస్థలకు సంబంధించి ఇంకా రూ.1.40 కోట్లు వసూలు కావాల్సి ఉందని మున్సిపల్ సిబ్బంది తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2.32 కోట్లను వసూలు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో గురువారం వరకు రూ.2.50కోట్లను వసూలు చేశారు.

బడ్జెట్ సమావేశం రేపు

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపాలిటీకి సంబంధించిన నిధుల రాబడి, ఖర్చులు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. అలాగే మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం ద్వారా రూ.53.19 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులను తాగునీటి సరఫరా, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, వేస్ట్ మేనేజ్‌మెంట్, పార్కులు, చెట్ల పెంపకం, తదితర 11 అంశాల పనులకు ఖర్చు చేసే విషయంపైన చర్చించి ఆమోదించనున్నట్లు తెలిపారు.

వడ్డీపై 50శాతం రాయితీ



ప్రభుత్వం మున్సిపల్ పన్నుల వడ్డీపై 50 శాతం రాయితీని ప్రకటించడంతో మొండి బకాయిదారులు చెల్లింపులకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే రూ.2.50కోట్ల వసూళ్లు చేపట్టాం. మిగిలిన నాలుగు రోజుల్లో మిగిలిన లక్ష్యాన్ని సాధిస్తాం.

- గంగా ప్రసాద్, కమిషనర్, ఆత్మకూరు మున్సిపాలిటీ